సాక్షి చిత్తూరు

శుక్రవారం । 15 । మార్చి । 2024



అర్హులందరికీ ఈబీసీ నేస్తం

చిత్తూరులో వైఎస్సార్ ఈబీసీ నేస్తం చెక్కులను పంపిణీ చేశారు. వర్చువల్ విధానంలో సీఎం ప్రసంగాన్ని అధికారులు వీక్షించారు. - 10లో



ఇది టీడీపీ, జనసేన చేసిన హత్య

గీతాంజలి మృతిపై పలమనేరు ప్రజానీకం భగ్గుమంది. చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేసింది. - 10లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
చిత్తూరు	6.29	5.00
పుంగనూరు	6.30	5.04

న్యూస్‌రీల్

గ్రూప్–1 పరీక్షలకు ఏర్పాట్లు

- కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ నంబర్ 9491077356



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 17న గ్రూప్–1 పరీక్షలకు ఎస్వీ సెట్, సీతమ్స్, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మూడు కేంద్రాలలో 2,518 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవనున్నట్లు చెప్పారు. పేపర్ 1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు, పేపర్ 2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేది లేదన్నారు. పరీక్షల నిర్వహణకు లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. అభ్యర్థులకు ఏవైనా సమస్యలున్నట్లయితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 9491077356కు సంప్రదించాలని తెలిపారు.

అన్ని టీమ్‌లు సిద్ధంగా ఉండాలి

– కలెక్టర్ షణ్మోహన్




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించేందుకు అన్ని టీమ్‌ల సభ్యులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో పలు ఎన్నికల టీమ్‌ల సభ్యులతో కలెక్టర్ సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అబ్జర్వర్లకు వాహనాలను సిద్ధం చేయాలన్నారు. ఎస్వీ సెట్‌లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈని ఆదేశించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్ సరిహద్దు చెక్‌పోస్టులలో సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు, సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డెమో ఈవీఎంలలో 1,25,036 డమ్మీ ఓట్లు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై జిల్లా యంత్రాంగం వివిధ ప్రాంతాలల్లో డెమో ఈవీఎంలను ఏర్పాటు చేసింది. డెమో కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ప్రజలకు ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక సిబ్బందిని సైతం నియమించారు. కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో, 7 నియోజకవర్గాల కేంద్రాల్లో డెమో ఈవీఎం కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 1,25,036 మంది ఈవీఎంలలో తమకు నచ్చిన డమ్మీ నంబర్లకు ఓట్లు వేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం 16 వేల మంది, ఆర్డీఓ కార్యాలయాలతో పాటు నియోజకవర్గ కేంద్రాలపై పుంగనూరు 12,405, నగరి 9514, జీడీ నెల్లూరు 18,027, చిత్తూరు 20,623, పూతలపట్టు 14,705, పలమనేరు 12,887, కుప్పం 20,875 చొప్పున మొత్తం 1,25,036 మంది డమ్మీ ఓట్లను వేశారు.

నిందితులను ఉరి తీయండి



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం:గీతాంజలి మృతికి కారకులైన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని ఎంపీపీ లత డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గాండ్లమిట్టలో మహిళలతో కలసి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. గీతాంజలి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. నాడు రిషితేశ్వరి నుంచి నేడు గీతాంజలి వరకు పచ్చమూకల వికృత చర్యలకు బలయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ఇంటి పట్టా వచ్చిందనే ఆనందంతో ఆమె మాట్లాడితే దారుణంగా టీడీపీ, జనసేన మూకలు ట్రోల్ చేసి బలిగొన్నాయని, నిందితులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు గోపి, పురుషోత్తంరాజు, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు గిరిజ, పట్టణాధ్యక్షురాలు మోహనమ్మ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇది కదా అభివృద్ధి

అటవీ ప్రాంతానికి సమీపంలో కంప చెట్ల పాకల్లో నివాసం..శ్రమల కోర్చి అటవీ ఉత్పత్తులను సేకరించి పొట్ట పోసుకునే గిరిజనుల జీవితం. వారి బతుకులను మార్చింది జగనన్న ప్రభుత్వం.. వారందరికీ వైఎస్సార్ జగనన్న కాలనీలో పక్కా ఇళ్లు మంజూరు చేసింది.. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా ఆ కాలనీ నిర్మాణం పూర్తిచేసింది. ప్రభుత్వ సాయం అంటే తెలియని వారి బతుకుల్లో సంక్షేమ కాంతులు నింపింది. వారి జీవన శైలిని మార్చింది.




రంగాపురంలోని వైఎస్సార్ జగనన్న కాలనీ

అందుతున్న సంక్షేమ పథకాలు

- జగనన్న ఇళ్లు 24
- అమ్మ ఒడి 15 మందికి
- చేయూత 18 మందికి
- రైతు భరోసా 10 మందికి
- పింఛన్లు 36 మందికి
- కొత్త రేషన్ కార్డులు 20
- కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డులు : 20
- జగనన్న విద్యా దీవెన నలుగురికి

బతుకు మారె.. పక్కాగా గూడు కుదిరె..

- నాడు అటవీ ప్రాంతంలో కంపచెట్ల పాకల్లో జీవనం
- వానొస్తే చెట్ల కింద ఆశ్రయం
- అప్పట్లో కొందరికి వైఎస్సార్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు
- ఇప్పుడు అందరికీ వైఎస్సార్ సీపీ పాలనలో ఒకేచోట పక్కా గృహాలు
- రాష్ట్రంలోనే మొట్ట మొదట నిర్మాణం పూర్తయిన జగనన్న కాలనీ
- దరి చేరిన సంక్షేమ పథకాలు
- మారిన గిరిజనుల బతుకులు

సాక్షి, తిరుపతి డెస్క్: పలమనేరు మండలం సముద్రపల్లె పంచాయతీ యానాదికాలనీ మండలంలోనే విసిరేసినట్టు అడవికి ఆనుకుని ఉన్న గ్రామం. ఇక్కడ బందారు మొక్కల తడికెలతో కనీసం మట్టిగోడలు కూడాలేని చిన్న పాకల్లోనే ఉండేవారు. వర్షమొస్తే పాకలు తడిసి రాత్రంతా జాగారం చేయాల్సిందే. ఇక గాలొస్తే ఆ పాకలు కొట్టుకుపోయేవి. వీరు ఉదయాన్నే అడవిలోకి వెళ్లి పండ్లను సేకరించి, వాటిని అమ్మి జీవించేవారు. దీనిని గమనించిన గ్రామపెద్ద రంగన్న ఈ అడవి తల్లి బిడ్డలు తలదాచుకునేందుకు కనీసం మంచి గూడైనా కల్పించాలని సంకల్పించారు. 2005 – 2009 మధ్యకాలంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 40 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించారు. ఆ తర్వాత కుటుంబాల సంఖ్య పెరగడంతో గ్రామ సమీపంలో మళ్లీ కొత్త గుడిసెలు వెలిశాయి. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే ఈ కుటుంబాల్లో కొంత మంది అడవికి సమీపంలో కంప చెట్ల పాకల్లోనే తలదాచుకునే వారు.



వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు

సచివాలయం..చేరువైన సంక్షేమం

ఈ గ్రామానికి సమీపంలోనే సచివాలయం నిర్మించారు. సచివాలయ ఉద్యోగులు ఈ కాలనీకి వచ్చి ఈ అడవి బిడ్డలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఇప్పుడు ప్రతి కుటుంబంలోని వారికి అర్హత ఉన్న అన్ని పథకాలకు దరఖాస్తు చేయించారు. ఆ కాలనీకి, ఆనుకుని ఉన్న రంగాపురానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు.

బతకులు మార్చిన నవరత్నాలు

2009 తర్వాత సముద్రపల్లె పంచాయతీలో పేదలకు సంక్షేమ పథకాలు అందలేదు. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే రంగాపురం సమీపంలో గుడిసెలు, ముళ్ల కంపల పాకల్లో తలదాచుకునే 24 కుటుంబాలకు నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్ల పథకం కింద పక్కా ఇళ్లు మంజూరు చేశారు. సముద్రపల్లె పంచాయతీలో వైఎస్సార్ జగనన్న కాలనీలో అందరికీ ఇళ్లు కట్టించారు.

మారుతున్న జీవన ప్రమాణాలు

ఈ నాలుగేళ్లలో ఇక్కడ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి తో ఆర్థిక ఇబ్బందులు తొలగాయి. ముఖ్యంగా ఇక్కడి మహిళలు గ్రూపులో చేరడం..అవగాహన కార్యక్రమాలతో చైతన్యవంతులయ్యారు. తమ పిల్లలకు బడికి, అంగన్‌వాడీకి కేంద్రానికి పంపుతున్నారు. చాలామంది పురుషులు తాపీ పనులకు, యువకులు సమీపంలోని డెయిరీలో పనులకు వెళ్తున్నారు. నలుగురు విద్యార్థులు స్థానిక ప్రభుత్వ కళాశాలలో డెయిరీ టెక్నాలజీ కోర్సును చదివి సమీపంలోని డెయిరీలోనే ఉద్యోగాలు చేస్తుండటం విశేషం!

గంటల వ్యవధిలో బీమా



ఈమె పేరు యానాది ఈశ్వరి. గత ఏడాది డిసెంబర్‌లో ఈమె భర్త అనారోగ్యంతో కన్నుమూశాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి సచివాలయ సిబ్బంది గ్రామ సచివాలయం ద్వారా గంటల వ్యవధిలో వైఎస్సార్ బీమా మంజూరు చేయించారు. తక్షణం పదివేల రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వ పరంగా అందజేశారు. మరో నెల వ్యవధిలో లక్ష రూపాయల బీమా సొమ్మును ఆమె ఖాతాలో జమ చేయించారు.

ఇంతకంటే మేలు చేసేదెవరు?



మా కాలనీకి ఇవి కావాలి అని మేం అడగలేదు. అధికారులే సౌకర్యాలన్నీ ఉండేలా చేసినారు. మా బతుకులు మార్చినారు. మా బిడ్డలు మా మాదిరి కాకుండా చదువుకునే దానికి ఏర్పాట్లు చేసినారు. మాకు ఏం కావాలో ఈ ప్రభుత్వమే తెలుసుకుని అన్నీ ఇచ్చింది. ఇంతకంటే జనానికి మేలు చేసేవాళ్లు ఎవరు?

– యానాది మల్లిక, కొత్త ఎస్టీ కాలనీ, రంగాపురం

మా పాలిట దేవుడు జగనన్న



అడివికిబోయి కాయలు, పండ్లు తెచ్చుకుని అమ్ముకుని బతికేటోళ్లం. మమ్మల్ని వెతుక్కుంటా వచ్చి నాకు ఇల్లిచ్చినారు. మా ఇంటాయనకు పింఛను ఇప్పించారు. నాకు చేయూత ఇచ్చినారు. ఇంటికే బియ్యం వస్తాంది. మా కాలనీ పక్కనే అంగన్‌వాడీ సెంటర్ కట్నారు. జగనన్న మా పాలిట దేవుడయ్యా. ఆయనే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలయ్యా సామీ.

– యానాది జయమ్మ, కొత్త ఎస్టీ కాలనీ, రంగాపురం



జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం



కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన కొళాయిలు



కాలనీకి వేసిన రోడ్డు

అడగకనే అన్నీ ఇచ్చారు



మేం అడవికి దగ్గర్లో కంపలతో పాకలేసుకుని ఉండే వాళ్లం. మమ్మల్ని వెతుక్కుంటూ వలంటీరు, సచివాలయ అధికారులు వచ్చినారు. మాకు ఇంటి స్థలాలు ఇప్పిస్తామని కాయితాలు(దరఖాస్తులు) పెట్టించారు. కొన్ని రోజులకే స్థలాలు ఇచ్చినారు..వాళ్లే ఇళ్లు కట్టించినారు. నీళ్లు, కరెంటు ఇచ్చినారు. రోడ్డేప్పిచ్చినారు. మేం అడక్కుండానే అన్నీ ఇచ్చిన జగనన్న మా దేవుడయ్యా! – యానాది ఆంజి, కొత్త ఎస్టీ కాలనీ, రంగాపురం

రాష్ట్రంలో మొట్టమొదట పూర్తయిన జగనన్న కాలనీ ఇది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో రాష్ట్రంలోనే మొట్టమొదట నిర్మాణం పూర్తిచేసుకున్న కాలనీ ఇదే. ఈ కాలనీ వాసులకు ఏ పథకాలు వర్తిసాయో వాళ్లకే తెలియదు. వీళ్లు ఎవరూ మా సచివాలయానికి రాలేదు. మేమే వాళ్ల ఇళ్లకు వెళ్లి ఎవరు ఏ పథకానికి అర్హులో గుర్తిస్తున్నాం. అర్హత ఉన్న అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగకుండానే సంక్షేమ పథకాలు అందించే ప్రభుత్వం ఇది. సిఫార్సులు అవసరం లేదు. అర్హత ఒక్కటే ప్రామాణికం. – సీఎస్ మురళీనాథ్, వెల్ఫేర్ అసిస్టెంట్, సముద్రపల్లె సచివాలయం

నాడు రాజన్న.. నేడు జగనన్న



మా పంచాయతీలో ఉన్న ఈ గిరిజన కుటుంబాలకు వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇళ్లు కట్టించారు. ఆ తర్వాత మళ్లీ ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించారు. అన్ని పథకాలు అందించారు. ఒకప్పుడు అడవిపై ఆధారపడి కడుపు నింపుకునే మా గిరిజన కుటుంబాలు బతుకులు ప్రభుత్వం పుణ్యమా అని ఎంతగానో మారాయి.

– రంగన్న, గ్రామ పెద్ద, సముద్రపల్లె పంచాయతీ, పలమనేరు మండలం

ఐదేళ్లలో 30 ఏళ్ల అభివృద్ధి

- ఇంటింటికీ తాగునీరు
- అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతున్నాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరులో పాదయాత్ర చేస్తూ కరపత్ర ప్రచారం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



చాదర్ సమర్పించేందుకు దర్గాకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: ఒకే కుటుంబం 30 ఏళ్ల పాలనలో పుంగనూరులో ఎలాంటి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేలాది కోట్ల రూపాయలు విడుదల చేయడంతో ఐదేళ్లలో 30 ఏళ్ల అభివృద్ధి చేశామని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పునరుద్ఘాటించారు. గురువారం ఎంపీ రెడ్డెప్పతో కలసి పట్టణంలో హనుమంతు రాయునిదిన్నెలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పార్టీ జెండాలు పట్టుకుని మేళతాళాల హోరు, బాణసంచా మోతతో వేలాది మంది స్వాగతం పలికారు. హనుమంతరాయునిదిన్నె నుంచి రామసముద్రం రోడ్డు, బీడీ కాలనీ, ఎన్ఎస్ పేట, బ్రాహ్మణవీధి, సుబేదారువీధి, నాగపాళ్యెం, ఇందిరా సర్కిల్, ఎంబీటీ రోడ్డు మీదుగా మంత్రి పాదయాత్రతో కరపత్ర ప్రచారం చేశారు. జెడ్పీ బాలికల హైస్కూల్‌కు వెళ్లి బాలికలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనితీరును వివరించారు. చదువుల పరంగా ట్యాబ్‌లు వారికి ఎలా ఉపయోగపడున్నాయో అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేశామని, సంక్షేమ ఫలాలు అందించామన్నారు. అధికారం కోసం ప్రజలను మరోసారి వంచిచేందుకు చంద్రబాబు చేస్తున్న గారడీలు, కుట్రలను తిప్పికొట్టాలన్నారు. బాబును నమ్మి ఓట్లు వేస్తే సంక్షేమం ఆగిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు వైఎస్సార్ సీపీకి వేసి ఆశీర్వదించాలని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

పుంగనూరు ప్రజల దాహార్తి తీర్చేందుకు గండికోట రిజర్వాయర్ నుంచి రూ. 2600 కోట్లతో పైపులైన్లు వేసే కార్యక్రమం త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. నేతిగుట్లపల్లె రిజర్వాయర్ పనులను కూడ కోర్టు తీర్పు రాగానే పూర్తి చేస్తామన్నారు.

చాదర్ సమర్పణ

నాగపాళ్యెంలో సయ్యద్‌నూర్‌షా దర్గాలో మంత్రి పెద్దిరెడ్డి ప్రార్థనలు చేశారు. చాదర్‌ను తలమీద పెట్టుకుని దర్గా వరకు తీసుకొచ్చి సమర్పించారు. ముస్లింలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

గీతాంజలి మరణానికి కారకులను ఎవరినీ వదలిపెట్టం

పచ్చమూకలు సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా బీసీ మహిళను కించపరచి ఆమె మరణానికి కారణమయ్యారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి చంద్రబాబు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గీతాంజలి మరణానికి కారణమైన వారిని ఎవరి వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే ఆ ప్రాంత పోలీసులకు సమాచారం ఇవ్వాలని, కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడరాదన్నారు.

నేను సైతం వైఎస్సార్ సీపీకి..!

- సొంత ఆటోతో ఎన్నికల ప్రచారం



ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

చిత్తూరు రూరల్: 'నేను సైతం జగనన్న కోసం శ్రామికుడినవుతాను.. నేను సైతం..నేను సైతం' అనే లెవెల్లో ఓ ఆటో డ్రైవర్ తన ఆటోతో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వివరాలు..చిత్తూరు మండలం పచ్చనపల్లెకు చెందిన విజయ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 'వైఎస్సార్ వాహన మిత్ర' రూపంలో ఏటా రూ.10వేలు పొందాడు. దీంతో పాటు చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి 'ఆటో నేస్తం' పేరిట ఆటోడ్రైవర్లకు ఫ్యాంటు, షర్ట్, కుట్టు కూలీ వంటివి అందజేశారు. జగనన్న పథకాల లబ్ధి, విజయన్న సాయంతో తనకెంతో మేలు కలిగిందని వైఎస్సార్ సీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేసేందుకు విజయ్ ముందుకొచ్చాడు. గురువారం బీఎస్ఆర్‌పేట చెక్‌పోస్టులోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాలు కట్టిన అతడి ఆటోను జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు ప్రారంభించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు తన ఆటోతో ఉచితంగా ప్రచారం చేస్తానని విజయ్ చెప్పాడు. కార్యక్రమంలో సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, పాండియన్, జయచంద్ర, రాజా, గోవిందస్వామినాయుడు, రంజన్, భాస్కర్, రజని, రవినాయుడు పాల్గొన్నారు.

అపరిశుభ్రత వృత్తుల పిల్లలకు ఉపకారవేతనాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నగరం, పట్టణం, గ్రామ పంచాయతీలలో అపరిశుభ్రత వృత్తులలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలు ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 1 మొదలు 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ వర్తిస్తుందన్నారు. ఈ స్కాలర్‌షిప్‌కు కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి లేదన్నారు. డేస్కాలర్ విద్యార్థులకు ఏటా రూ.3 వేలు, వసతి గృహాల విద్యార్థులకు రూ.8 వేలు ఉపకారవేతనం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు సమీపంలోని ఆయా సచివాలయాల్లో ఏప్రిల్ 10వ తేదీలోపు నవశకం లాగిన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంబంధిత మండలాల ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు లాగిన్‌లలో సిఫార్సు చేసేందుకు ఏప్రిల్ 20వ తేదీ ఆఖరి తేదీ అని డీడీ ఆ ప్రకటనలో తెలియజేశారు.

శిక్షణకు గైర్హాజరైతే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : శిక్షణకు గైర్హాజరైతే చర్యలు తప్పవని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 13,14 తేదీలలో పీఓ, ఏపీఓలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని, అనివార్య కారణాలతో ఎవరైనా గైర్హాజరైన పక్షంలో 15,16వ తేదీలలో ఇచ్చే శిక్షణకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ యువనేత



కార్తీక్‌కు వైఎస్సార్ సీపీ కండువా కప్పుతున్న మండల కన్వీనర్

కుప్పం రూరల్: కుప్పం మండలంలోని సప్పానికుంట, కృష్ణాపురం గ్రామాలకు చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కార్తీక్ గురువారం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్తీక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు చెప్పాడు. పార్టీ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శీను, పళణి తదితరులు పాల్గొన్నారు.


చెక్‌బౌన్స్ కేసులో ఇద్దరికి జైలు

చిత్తూరు అర్బన్: చెక్ బౌన్స్ కేసులో ఇద్దరు నిందితులకు ఆరునెలలు జైలుశిక్ష విధిస్తూ చిత్తూరులోని ప్రత్యేక సంచార న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చింది. వివరాలు..తిరుపతికి చెందిన నాగరాజు ట్రాక్టర్ కొనుగోలు నిమిత్తం 2012 జూన్‌లో ఓ ఫైనాన్సు కంపెనీ నుంచి రూ.4.46 లక్షలు అప్పు తీసుకున్నాడు. దీన్ని తిరిగి చెల్లించే క్రమంలో రూ.3.04 లక్షలకు చెక్కు ఇచ్చాడు. బ్యాంకులో అంత మొత్తం నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. అలాగే మరోకేసులో పలమనేరుకు చెందిన వెంకటరమణ 2014లో ట్రాక్టర్ కొనుగోలుకు రూ.4.53 లక్షలు ఓ కంపెనీ నుంచి రుణం తీసుకున్నాడు. రూ.1.44 లక్షలు చెల్లించాల్సి ఉండగా, బ్యాంకు చెక్కు ఇవ్వడంతో అది బౌన్స్ అయ్యింది. దీంతో కంపెనీ నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. నేరం రుజువుకావడంతో ఇద్దరికీ జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ కీర్తన తీర్పునిచ్చారు.

టీడీపీ రెండో జాబితాలో సీనియర్లకు చంద్రబాబు మొండిచేయి చూపారు. పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న వారికి జాబితాలో చోటు దక్కకపోవడంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. పార్టీతో సంబంధం లేని వారికి, పార్టీలోనే చేరని వారికి అధినేత టికెట్ ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండు జాబితాలో బీసీలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంపై ఆ సామాజిక వర్గం భగ్గుమంటోంది. మొత్తంగా తిరుపతి, చిత్తూరు జిల్లాలో రెండో జాబితా టీడీపీలో చిచ్చుపెట్టింది.

- సత్యవేడులో మాజీ ఎమ్మెల్యేలు ఇద్దరికీ బాబు షాక్
- ఆదిమూలం అభ్యర్థిత్వంపై టీడీపీ శ్రేణుల్లో ఆందోళన
- వెంకటగిరిలో బీసీ నేతలకు మొండిచేయి
- శ్రీకాళహస్తిలో ఆ ముగ్గురి ఆశలపై నీళ్లు
- తిరుపతిలో 'ఆరణి' మంటలు..
- పుంగనూరులో యాదవ్ చెవిలో పువ్వు
- బీసీవై అభ్యర్థిగా బరిలోకి రామచంద్ర

తాంబూలాలిచ్చేశాం.. తన్నుకు చావండి



సాక్షి, తిరుపతి : సత్యవేడు సీటును టీడీపీలో కూడా చేరని ఆదిమూలంకు ఇవ్వడంపై ఆపార్టీ ఆశావహుల్లో ఆగ్రహజ్వాలు రేగాయి. పార్టీ అధిష్టానంపై తీవ్రంగా మండిపడుతున్నారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలానికి ప్రజాబలం లేదని, ఓటమి తప్పదని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆయనను ఆస్థానం నుంచి తప్పించింది. తిరుపతి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ విషయం ముందే తెలుసుకున్న ఆదిమూలం టీడీపీతో సంబంధాలు నెరుపుతూ వచ్చారు. ఎంపీ సీటు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచిని పక్కనపెట్టి టీడీపీతో రహస్య ఒప్పందం చేసుకున్నారు. టీడీపీలో చేరకపోయినా ఆదిమూలంను పిలిచి సత్యవేడు అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు. ఆదిమూలంతో చీకటి ఒప్పందాలు పెట్టుకోనప్పుడు సత్యవేడు అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ అని వారికి బాబు హామీ ఇచ్చారు. ప్రచారం చేసుకోమని చూడా వారికి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అందులో భాగంగా డాక్టర్ హెలెన్ నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలతో ప్రజల్లో తిరుగుతూ భారీగా డబ్బులు ఖర్చు చేశారు. అదే విధంగా 2019లో పోటీచేసి ఓటమి పాలైన జేడీ రాజశేఖర్‌కు కూడా అభ్యర్థిత్వంపై చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిసింది. మరో వైపు మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్యకు కూడా హామీ ఇచ్చి చివరకు హ్యాండ్ ఇవ్వడంపై వారి వర్గీయులు చంద్రబాబుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతిలో 'ఆరణి' చిచ్చు..

ఎమ్మెల్యే అని పించుకోవడం కోసం పార్టీలు మారిమారి చివరకు వైఎస్సార్‌సీపీలో చేరిన ఆరణి శ్రీనివాసులు 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాతో చిత్తూరు శాసనసభ్యుడిగా గెలుపొందారు. ఎమ్మెల్యే అయ్యాక స్వలాభాపేక్షతో పనిచేయడం.. ప్రజల్లో ఆరణిపై తీవ్ర అసంతృప్తి రావడంతో ఈసారి పోటీనుంచి తప్పించి, శ్రీనివాసులుకు సముచిత స్థానం ఇస్తామని సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. అయినా తాను చిత్తూరు నుంచి తిరిగి పోటీచేయాలనే ఉద్దేశంతో టీడీపీలో చేరాలని ఆరణి భావించారు. అక్కడా నిరాకరించడంతో చివరకు జనసేన కండువా కప్పుకున్నారు. భారీగా ప్యాకేజీ ఇచ్చి తిరుపతి జనసేన అభ్యర్థిగా దాదాపు ఖరారు చేయించుకున్నారు. తిరుపతి స్థానాన్ని జనసేనకు కేటాయించడాన్ని జీర్ణించుకోలేని టీడీపీ శ్రేణులు సైతం జనసేనలో చేరి పోటీచేయాలని భావించారు. ఇద్దరూ తిరుపతికి చెందిన టీడీపీ, జనసేన నేతల మాటలు వినిపించుకోకపోవడంతో గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన టీడీపీ, జనసేనలోని ఎవరో ఒకరికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 'ఆరణి' గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ.. నగరంలో ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు.

పాపం ఎస్సీవీ, కోలా, వినూత

శ్రీకాళహస్తి టికెట్ కోసం బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, జనసేన మహిళా నాయకురాలు వినూత ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలనే ఉద్దేశంతో టీడీపీ కండువా కప్పుకున్నారు. చివరకు మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి పేరును ఖరారు చేయడంతో ముగ్గురు షాక్‌కు గురయ్యారు. బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు ఖరారు అయిన రోజు నుంచే శ్రీకాళహస్తిలో ఉమ్మడి అభ్యర్థి తానేనని కోలా ఆనంద్ ప్రకటించుకున్నారు. అందులో భాగంగా రోజూ ఊరూ వాడా ప్రచారం కూడా చేస్తున్నారు. ఇంకా పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి జనసేనకే కేటాయిస్తారని వినూత ప్రచారం చేసుకున్నారు. వీరెవ్వరినీ కాదని బీజేపీ, జనసేన అధిష్టానం టీడీపీకి కేటాయించడంపై ఆ ముగ్గురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పుంగనూరు, వెంకటగిరిలో యాదవులకు మొండిచేయి

పొత్తులో భాగంగా పుంగనూరు నుంచి తానే పోటీలో ఉంటానని రామచంద్రయాదవ్ చెప్పుకుంటూ వచ్చారు. బీజేపీ నుంచి లేదా జనసేన కోటాలో తనే అభ్యర్థినని ప్రకటించుకున్నారు. చివరకు టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డినే ఖరారు చేయడంతో యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీవై పార్టీ పేరుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. వెంకటగిరి టికెట్ ఈసారి బీసీలకు కేటాయించాలని మస్తాన్ యాదవ్, మరికొందరు చేనేత కార్మికులు గట్టిగా ప్రయత్నాలు చేశారు. పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి విన్నవించారు. ఆ తరువాత కూడా బీసీలంతా ఏకమై సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానం కాపీని కూడా టీడీపీ అధిష్టానానికి పంపినా ప్రయోజనం లేకుండా పోయింది.

ఆ ఇద్దరు ఊపిరి పీల్చుకున్నారు

చంద్రగిరి టీడీపీ అభ్యర్థిగా 2019 ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన పులివర్తి నానికి ఈసారి టికెట్ ఉండదనే ప్రచారం జోరుగా సాగింది. అందుకు రియల్టర్ డాలర్ దివాకర్‌రెడ్డి కారణం. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లాభాలు ఆర్జించిన డాలర్ చంద్రగిరి నుంచి పోటీ చేయాలని కొంతకాలంగా బ్యానర్లు, ఫ్లెక్సీలతో హంగామా చేస్తూ వచ్చారు. తరచూ ఆత్మీయ సమావేశాలు కూడా ఏర్పాటుచేసి భారీగా నజరానాలు అందిస్తూ పలువురి దృష్టిలో పడేందుకు కిందా మీదా పడ్డారు. టీడీపీ మొదటి జాబితాలో పులివర్తి నాని పేరు లేకపోవడంతో ఇక తనకే టికెట్ అని డాలర్ పెద్దఎత్తున ప్రచారం చేసుకున్నారు. చివరకు నానినే అభ్యర్థిగా ప్రకటించడంతో ఇన్నాళ్లు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. అలాగే శ్రీకాళహస్తి టికెట్ బీజేపీ, జనసేనకు కాకుండా టీడీపీకే కేటాయించడంతో బొజ్జల సుధీర్ రెడ్డి ఊపిరి పీల్చుకున్నారు.

అర్హులందరికీ ఈబీసీ నేస్తం

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఈబీసీ నేస్తం అమలు చేస్తోందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం వైఎస్ఆర్‌ఈబీసీ నేస్తం మూడవ విడత పథకం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు వర్చువల్‌లో వీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడారు. రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ వర్గాల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం ఈబీసీ నేస్తం అమలు చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైన వారికి ఏటా రూ.15 వేల చొప్పున ఇస్తోందని, ప్రస్తుతం మూడవ విడతలో 23,215 మందికి రూ.34.82 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. మొత్తంగా మూడు విడతల్లో 69,934 మంది లబ్ధిదారులకు రూ.104.92 కోట్లను అందజేసిందన్నారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ, టీడీపీ సర్కారు పథకాల పేరిట ప్రజలకు మోసం చేసిందన్నారు. కొన్ని సామాజిక వర్గాలకు మాత్రమే టీడీపీ పాలనలో పథకాలు అందేవని విమర్శించారు. వైఎస్ఆర్‌సీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం మెగాచెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



వైఎస్‌ఆర్ ఈబీసీ నేస్తం మెగా చెక్కును అందజేస్తున్న జేసీ శ్రీనివాసులు, మేయర్ అముద

సైనిక్ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం



విద్యార్థులతో కరస్పాండెంట్, అకడమిక్ డైరెక్టర్

తిరుపతి ఎడ్యుకేషన్ : సైనిక్ స్కూల్లో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష మొదటి విడత ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు 237మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. వీరిలో 6వ తరగతి ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో 300లకు 275మార్కులతో ఆరాధ్య, 9వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో 400లకు 352మార్కులతో శశాంక్, 336మార్కులతో లోచన్, అలాగే రిషిత, నితీష్, వెనిష్‌రెడ్డి, పద్మినిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, జయసూర్య సాయికుమార్, సాకేత్, లిశ్వంత్, భరత్, అయాన్, మహిధర్, రసగ్న, దీక్షిత్, సుధంశ్, లిఖిత, గంగా జైదీష్, సాత్విక్, హరిచరణ్, పూజ, ట్వింకిల్ తదితరులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించినట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను, సహకరించిన అధ్యాపక బృందాన్ని ఆయనతోపాటు విద్యాసంస్థ కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి అభినందించారు.

చేయూత.. మహిళలకు ఆర్థిక భరోసా

పుత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్క చెల్లెమ్మలకు చేయూత పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించారని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పుత్తూరు అర్బన్, రూరల్, వడమాలపేట మండలాల మహిళలకు 4వ విడత చేయూత మెగా చెక్కులను ఆమె పంపిణీ చేశారు. లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. గడచిన నాలుగేళ్లలో ఒక్క వైఎస్సార్ చేయూత పథకం రూపేణా రాష్ట్ర వ్యాప్తంగా 33,14,916 మంది అక్క చెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లోకి రూ.19,189 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఒక్క పుత్తూరు అర్బన్‌లో రూ.17.05 కోట్లు, రూరల్‌లో రూ.9.58 కోట్లు, వడమాలపేట మండలంలో రూ.13.30 కోట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో మహిళలను పట్టించుకున్న పాపాన పోలేదని, జగనన్న పాలనలో మహిళలకు పెద్దపీట వేస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వాటిని ఉదహరించారు. డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద రూ.25,570 కోట్లు వారి ఖాతాల్లోకి జమ చేశారన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి అంటే గిట్టని టీడీపీ, జనసేన దొంగలు ఎన్నికల పేరిట వస్తున్నారని, వారిని ఎన్నికల్లో చిత్తుగా ఓడించి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, మెప్మా సిటీ మేనేజర్ ప్రమీల, పుత్తూరు, వడమాలపేట ఎంపీపీలు మునివేలు, విజయలక్ష్మి, వడమాలపేట జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు, పుత్తూరు సచివాలయ కన్వీనర్ ఏకాంబరం, ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ సుదర్శన్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



చేయూత మెగా చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

ఇది టీడీపీ, జనసేన చేసిన హత్య

- ట్రోల్స్‌తో గీతాంజలి ప్రాణం తీశారు
- సిగ్గూ శరం లేకుండా మళ్లీ శవరాజకీయాలు చేస్తారా?
- భగ్గుమన్న పలమనేరు ప్రజానీకం
- చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

పలమనేరు: తల్లిలేని బిడ్డలుగా మారిన గీతాంజలి కుమార్తెలకు వారి అమ్మని తీసుకురాగలరా? అసభ్యకరంగా, నీచాతినీచంగా ట్రోల్స్‌తో ఓ నిండు ప్రాణాన్ని పొట్టనబెట్టుకున్నారు..ఇది టీడీపీ, జనసేన చేసిన హత్య అంటూ పలమనేరు ప్రజానీకం భగ్గుమంది. గురువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను దహనం చేసి ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. గీతాంజలి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఐటీడీపీ సోషల్‌మీడియాతోపాటు చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లపై చర్యలు తీసుకోవాలని నినదించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, కౌన్సిలర్లు శ్యామ్‌సుందర్‌రాజు, నాగరాజు, గంగమ్మగుడి చైర్మన్ నరేష్ మాట్లాడారు. రాజకీయాలకు సంబంధం లేని ఓ బీసీ మహిళ తనకు ఇల్లు వచ్చిందంటూ ఆనందం వ్యక్తం చేసిన వీడియోను చూసి టీడీపీ సోషల్ మీడియా ఆమెను దారుణంగా కామెంట్లు, ట్రోల్స్ చేసి బలిగొన్నారని, ప్రభుత్వం చేసిన మేలును చెప్పుకోవడమే ఆ మహిళ చేసిన తప్పా? అని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతున్నా ఏమాత్రం సిగ్గూ శరం లేకుండా మళ్లీ శవరాజకీయాలు చేయడం దారుణమని మండిపడ్డారు. ఇలాంటివి పునరావృతం కాకుండా గీతాంజలి మరణానికి కారకులైన పాత్రధారులు, సూత్రధారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, వైస్ చైర్మన్ రవి, కౌన్సిలర్లు హైదర్, శ్యామ్,రాజేష్, షబీర్, షరీఫ్, ముజ్జు, శశి, పీఏసీఎస్ అధ్యక్షులు రఘునాథ్, పెద్ద సంఖ్యలో డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



చంద్రబాబు దిష్టిబొమ్మను ధహనం చేస్తున్న ప్రజలు, పార్టీ నాయకులు

ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల విధులు

చిత్తూరు కలెక్టరేట్ : నిబంధనలు పాటిస్తూ, ప్రతి ఉద్యోగి ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక పీవీకేఎన్, జెడ్పీ సమావేశ మందిరంలో పీఓ, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జేసీ మాట్లాడారు ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ పొందే అవకాశం ఉందన్నారు. ఎన్నికల విధులకు గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులకు మినహాయింపు ఉంటుందన్నారు. పీఓ డైరీ, ఓటింగ్, ఓటర్లకు సీరియల్ నంబర్ ప్రకారం స్లిప్‌లు ఇవ్వడం..ఇత్యాది వాటిపై ఆయన మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ ప్రభాకర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.